క్లుప్తంగా

నేడు సీతా రాముల కల్యాణం



పూజలందుకుంటున్న సీతారాములు

అట్లూరు: బోడిశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా వెలసిన ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో గ్రామస్తులు చందాల ద్వారా నూతనంగా రామాలయం నిర్మించారు. అయితే ఆలయంలో సీతారామలక్ష్మణుల మూలవిరాట్ విగ్రహాలను ప్రతిష్టించడంతో పాటు ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం విగ్రహప్రతిష్ట మహోత్సవం పూర్తి కావడంతో శనివారం కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

అన్నదానం మహాదానం



అన్నదానం చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి

బద్వేలు అర్బన్ : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని పంచాయతీ సెక్రటరీ ఎద్దుల ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి తెలిపారు. స్థానిక తెలుగు గంగ కాలనీ రోడ్డులోని నిరాశ్రయుల వసతిగృహంలో శుక్రవారం విశ్రాంత అటవీ అధికారి ఎద్దుల వెంకటసుబ్బారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేయడంతో పాటు ఆశ్రమానికి అవసరమైన స్టీల్ సామాన్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటసుబ్బారెడ్డి కుమారులు, పంచాయతీ సెక్రటరీ ఎద్దులప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి మాట్లాడుతూ వృద్ధులను ఆదరించడం గొప్ప విషయమని, ప్రతిఒక్కరు అనాథ వృద్ధులను ఆదుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. కార్యక్రమంలో ఎద్దులపెద్దసుబ్బారెడ్డి, నడిపిసుబ్బారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, నందగోపాల్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

బి.కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దుళ్లపల్లె, కొండంపల్లె గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. నీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సెక్రటరీ హరీష్‌రెడ్డి, ఏఎన్‌ఎం నూర్జహాన్, ఎంఎల్‌హెచ్‌పీ అశ్వని, ఆశా కార్యకర్త మంజుల, అంగన్వాడీ టీచర్ సావిత్రి, ప్రజలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ కార్యవర్గం

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నానబాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బి.గురుమూర్తి, గౌరవాధ్యక్షుడిగా గానుగపెంట హనుమంతరావు, గౌరవ సలహాదారులుగా షేక్‌మహబూబ్‌బాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.వి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసులరెడ్డి, అబ్దుల్‌సత్తార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీనివాసులు, యూత్ కన్వీనర్‌గా పి.వి.సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొర్రపాటిసురేంద్ర, లీగల్ అడ్వైజర్‌గా మురళిని ఎన్నుకున్నారు. అలాగే మీడియా ఇన్‌చార్జిగా సి.వెంకటసుబ్బయ్యతో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. బద్వేలు పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. కార్యక్రమంలో బాలయ్య, కె.బి.రసూల్, చిన్న, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థికసాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారుడు శ్రీకాంత్‌కు దాతలు అండగా నిలిచారు. ఈ మేరకు శ్రీకాంత్‌కు ఇమ్మస్ సంస్థ సహకారంతో గురువారం నగరానికి చెందిన కేతి ప్రకాశ్, ఎలీసా, రాంబాబులు రూ. 5 వేల విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సీహెచ్ జాన్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించితే అనర్థమే..!

వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరుగుతోంది. సాగు విధానాలు, పంట తెగుళ్లపై అవగాహన పెంచుకోకుండా రైతులు విచక్షణారహితంగా పురుగు మందులు, రసాయన ఎరువులు చల్లుతున్నారు. దీంతో సాగు వ్యయం పెరుగుతోంది. అంతేకాక నేల నిర్జీవంగా మారుతోంది. గాలి, నీరు కలుషితం అవుతున్నాయి. పంటల సాగులో సూచనలు పాటిస్తే చీడపీడలను నియంత్రించి మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

- అతిగా వాడుతున్న రసాయన ఎరువులతో ముప్పు
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- అప్రమత్తత అవసరమంటున్న వ్యవసాయాధికారులు



వరి పైరులో ఎరువులను చల్లుతున్న రైతు

చాపాడు: ఖరీఫ్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు అధికంగా సాగు చేసే వరి పైరులో మోతాదు తగ్గించి ఎరువులు వాడుకోవాలని, లేదంటే పంటపై తెగుళ్ల దాడి ఎక్కువగా ఉంటుందని, రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల మోతాదుతో వినియోగించాలని మండల వ్యవసాయాధికారి ఇ.మ్యాగీ సూచించారు. వరిలో యాజమాన్య పద్ధతులు పాటించటం వలన తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఖరీఫ్‌లో సాగయ్యే వరిలో ఎరువులు, పురుగు మందులు విచక్షణ రహితంగా వాడకూడదని హెచ్చరించారు. భూ సారాన్ని బట్టి నత్రజని, బాస్వరం, పొటాస్, జింక్ ఎరువులను సిఫార్సు మేరకే వేయాలని రైతులకు పలు రకాలైన సలహాలు, సూచనలను ఏఓ ఇచ్చారు.

నత్రజని ఉపాయోగాలు

వరి సాగులో నత్రజనిని కాంప్లెక్స్ రూపంలో గానీ.. యూరియా రూపంలో అందజేయాలి. పంట ఎదుగుదలకు ఖరీఫ్‌లో మూడు సమ భాగాలుగా విభజించి నత్రజనిని వేసుకోవాలని చెబుతున్నారు. మొదట భాగాన్ని ఆఖరు దమ్ములో వేయాల్సి ఉంటుందని, రెండో భాగం పిలకలు వేసే సమయంలో వేయాలి. మూడో భాగంగా అంకురం ఏర్పడే దశలో వేయాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి కలిపి ఉపయోగించాలని, దీని ద్వారా వరి మొక్కలు నత్రజని సక్రమంగా వినియోగించుకుంటాయని చెబుతున్నారు.

భాస్వరం చాలా కీలకం

భాస్వరం వరి పంట కీలకం. ఇది మొక్కల వేరు వ్యవస్థ అభివృద్ధి చెందటానికి ఉపయోగపడుతుంది. పూర్తి మోతాదును ఆఖరి దమ్ములో వేయాలి. లేదంటే నాటి పది రోజుల్లో వేయాల్సి ఉంటుంది.

పొటాష్ వినియోగం

పొటాష్ మొక్క ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. అలాగే వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు దోహదం చేస్తుంది. చీడపీడలను నివారిస్తుంది. పొటాష్ వాడకం వలన చీడ పీడల బెడద తక్కువగా ఉంటుంది. పిండి పదార్థం తయారు కావటానికి దోహద పడుతుంది. దీన్ని పిలక వేసే దశలో, అంకురం ఏర్పడే దశలో వేయాలని సూచిస్తున్నారు.

జింక్ లోపం నివారించాలి

నియోజకవర్గంలో సాగు అంచనా ఇలా..

మండలం	ఎకరాలు
మైదుకూరు	2,100
చాపాడు	5,800
ఖాజీపేట	4,800
దువ్వూరు	3,800
మొత్తం	16,500

వరిలో జింక్ లోపాన్ని నివారించాల్సిన అవసరం ఉంది. లేకుంటే మొక్క ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొక్కలు ఎరువులను గ్రహించలేదు. దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ వేయాలని, నాటిన తర్వాత జింక్ లోపం కన్పిస్తే జింక్ సల్ఫేట్ ఎకరాకు 200 ఎంఎల్ మందులను నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఖరీఫ్‌లో ఎరువుల వాడకం

భాస్వరం ఎరువును, సూపర్ సింగిల్ ఫాస్పేట్‌ను 150 కిలోలు దమ్ములో వేయాలి. కాంప్లెక్స్ ఎరువులపై పాటుగా వేయరాదు. దమ్ములో వేయకపోతే 10 రోజుల్లో వేయాలి. 78 కిలోల యూరియాను మూడు దఫాలుగా వేయాలి. పొటాష్ 40 కిలోలు రెండు దఫాలుగా వేయాలని సూచించారు. వ్యవసాధికారుల సలహాలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు.

నేడు వైద్య సేవలు బంద్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో శనివారం వైద్యసేవలు నిలిపేస్తున్నట్లు ప్రొద్దుటూరు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జీవీజీ మహేష్, కార్యదర్శి డాక్టర్ హరీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కత్తాలో ఈ నెల 9న రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎంఏ ఒక రోజు వైద్య సేవల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహాయించి శస్త్రచికిత్సలు, ఓపీడీ సేవలను పూర్తిగా నిలిపేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బద్వేలు అర్బన్ : కోల్‌కత్తాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాలలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో సత్వర న్యాయం జరగాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రశాఖ నిర్ణయం మేరకు బద్వేలులో 24 గంటల పాటు వైద్యసేవలు నిలిపివేయనున్నట్లు ఐఎంఏ బద్వేలుశాఖ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు మినహాయించి అన్ని రకాల సేవలు నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ మండలం, రాజుపాళెం మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఐ బి. బాలమద్దిలేటి తెలిపారు. రూరల్ సీఐగా శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. పులివెందుల రూరల్ సర్కిల్‌లో పని చేస్తున్న బాలమద్దిలేటి ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. గ్రామాల్లో గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

శాంతి భద్రతల కల్పనే లక్ష్యం

అట్లూరు: శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని బి.రామకృష్ణ స్పష్టం చేశారు. అట్లూరు ఎస్‌ఐగా శుక్రవారం రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ కె.సి.రాజు బి. కోడూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లడంతో ప్రొద్దుటూరు 2 టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న రామకృష్ణను అట్లూరుకు బదిలీ చేశారు.

ప్రజా సమస్యలకు పరిష్కారానికి కృషి



ఎస్‌ఐ వెంకటరమణకు శాలువా కప్పి, పూలమొక్క అందిస్తున్న జగన్

రాజుపాళెం : ప్రజా సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తానని రాజుపాళెం ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. రాజుపాళెం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణను శుక్రవారం ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్‌ఎస్‌ఓ నాయకుడు లింగమయ్య, ప్రసాద్, ఓబులేసు పాల్గొన్నారు.

వరాల కల్పవల్లి.. దీవించమ్మా



ప్రొద్దుటూరు కల్చరల్ : గజవాహనంపై ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మిదేవి



బద్వేలు అర్బన్ : ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



బి.కోడూరు : ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వరలక్ష్మిదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరాలతల్లి వరలక్ష్మి అనుగ్రహం కోసం భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఉభయదాతలు పోలా ధీరజ్ కుమార్‌రెడ్డి, పల్లవి దంపతులు, వీరి కుటుంబ సభ్యుల సహకారంతో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. వ్రతం ఆచరించడం వలన కలిగే శుభాలను, అమ్మవారి మహిమలను వేదపండితుల భక్తులకు వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, ఎక్స్‌అఫిషియో మెంబర్ మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీవ్రతం, శ్రావణ శుక్రవారం సందర్భంగా లలితాదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం

పోరుమామిళ్ల: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, పూజాకార్యక్రమాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు పెసల నరసింహులు దంపతులు వ్రతంలో పాల్గొన్న మహిళలకు శ్రీమహాలక్ష్మి యంత్రం, కుంకుమ, వ్రత పుస్తకము, జాకెట్లు అందచేశారు. మధ్యాహ్నం మహిళలకు భోజన సదుపాయం కల్పించారు.

లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

స్థానిక లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం ఘనంగా నిర్వహించారు. వ్రతం అనంతరం కమిటీసభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మి దేవి వ్రతం ఘనంగా జరిగింది.

వెల్లాలలో..

రాజుపాళెం : మండలంలో వెల్లాల పుణ్యక్షేత్రంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం అంగరంగ వైభవంగా జరిగింది. వరలక్ష్మీదేవి అమ్మవారిని కలశాలోకి ఆవాహన చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్ పాల్గొన్నారు. టంగుటూరులోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈఓ రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

అల్లాడుపల్లె వీరభద్రస్వామి సన్నిధిలో..

చాపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వీరభద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో భద్రకాళీ మాత అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలందరూ సామూహికంగా వరలక్ష్మి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు నరేంద్ర శర్మ, భరత్‌కుమార్ శర్మ వరలక్ష్మి వ్రత ప్రత్యేక పూజలు నిర్వహించి, వ్రతం గొప్ప తనాన్ని మహిళలకు తెలియజేశారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం

కాశినాయన : మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకున్నారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీవ్రతంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన నరసాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వరలక్ష్మివ్రతం నిర్వహించారు. అలాగే వరికుంట్ల సమీపంలోని శ్రీకాశీవిశ్వనాధుని ఆలయంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.

బద్వేలు పట్టణంలో..

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కలశపూజ, కుంకుమార్చన, గణపతి పూజలతో పాటు వరలక్ష్మి వ్రతం చేశారు. అలాగే పోలీసుస్టేషన్ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిశాల, కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.



పోరుమామిళ్ల: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వ్రతంలో పాల్గొన్న మహిళలు



చాపాడు: అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు



కాశినాయన : వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

చెన్నకేశవస్వామి ఆలయంలో..

కలసపాడు : స్థానిక లక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వారణాసి వెంకటరమణ వరప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలను ఏర్పాటు చేసి సామూహికంగా పూలు, పండ్లతో పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

బి.కోడూరు : శ్రావణమాసం రెండవ శుక్రవారం రోజున మండలంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని మేకవారిపల్లె సమీపంలోని అఖిలాండ కోటి బ్రహ్మానంద ఆశ్రమంలో అధిక మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో రైతుల బెంబేలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు నిత్యం చోరీకి గురవుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని మండల రైతులు వాపోతున్నారు. ఇటీవల శేషయ్యగారిపల్లి, ఖాదర్‌ఖాన్ కొట్టాలు, గోపవరం తదితర ప్రాంతాల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ముగ్గురు రైతుల పాత ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఖాదర్‌ఖాన్ కొట్టాల దగ్గర సమీప చెరువులో ట్రాన్స్‌ఫార్మర్ పడేసి ఆయిల్ కింద పోసి కాపర్ వైర్‌ను దొంగలించారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో 10 నుంచి 12 కేజీల కాపర్ వైర్ ఉంటుందని వాటి విలువ పదివేల రూపాయలు ఉంటుంది. ఆయా విషయాలపై ఏఈ రామలింగారెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్న మాట వాస్తవమేనని, అయితే రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

రూ. 10 నాణేలపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రూ. 10 నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. గురువారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో కెనరా బ్యాంకు ఎదుట రూ. 10 నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శివశంకర్ సూచన మేరకు ఈ నాణేలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రూ. 10 నాణెం చెల్లుబాటు అవుతుందని ఆర్‌బీఐ ప్రకటించిందన్నారు. ఈ నాణెం చెల్లదంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మరాదని ఆయన సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్దనమ్ మాట్లాడుతూ రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని, వాటిని విరివిరిగా వాడాలన్నారు. రూ. 10 నాణేలను అన్నిరకాల లావాదేవీల్లోనూ ఉపయోగించవచ్చన్నారు. వివిధ రకాల వ్యాపారులు దాదాపు రూ. లక్ష విలువజేసే రూ.10 నాణేలను తమవ్యాపార నిమిత్తం తీసుకున్నారు. కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ డివిజన్ మేనేజర్ రమేష్, మెయిన్ బ్రాంచ్ మేనేజర్ మధుకర్ పాల్గొన్నారు.



రూ.10 నాణేలను అందజేస్తున్న కెనరా బ్యాంకు ఆర్‌ఎం మురళీమోహన్

నేడు ఉచిత థైరాయిడ్ పరీక్షల శిబిరం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులోని బంగారుశీనయ్య హాస్పిటల్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత థైరాయిడ్ పరీక్షల వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బంగారుశీనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరంలో థైరాయిడ్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేనేత సంఘం అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె చేనేత సహకార సంఘంలో 2009 నుంచి 2019 వరకు జరిగిన అవినీతి అక్రమ లావాదేవీలపై విచారణ చేయాలని లోకాయుక్తను ఆదేశించాలని కోరుతూ ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది సంవత్సరాలుగా విచారణ పేరుతో కాలయాపన జరుగుతుందని, విచారణ జరిపి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని ఫిర్యాదు కోరినట్లు తెలిపారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో దువ్వూరు మండలం మాచనపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ మేరకు కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా విద్యార్థులు సంజనారెడ్డి, హేమలత, కావ్యశ్రీలకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, గైడ్ టీచర్ వెంకటసుబ్బయ్యతోపాటు ఉపాధ్యాయ బృందాన్ని కలెక్టర్ అభినందించారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.